
మా బాబే.. మాతో నడుస్తున్నాడే : చెయ్యేరులో ఉపాధి హామీ మహిళా శ్రామికులతో కలిసి చెరువును పరిశీలించి వస్తున్న సీఎం చంద్రబాబు


పెన్షన్..నో టెన్షన్ : ఉపాధి హామీ శ్రామికులతో మాట్లాడి అక్కడే పింఛను అందజేస్తున్న సీఎం చంద్రబాబు


మీ సేవకు హ్యాట్సాఫ్ : బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకున్న మంతెన రామరాజును సన్మానిస్తున్న సీఎం


మీ మనసు బంగారం : బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకున్న త్సవటపల్లి నాగేంద్రరావుకు సన్మానం


మీ వెంటే నడుస్తాం : చెయ్యేరులో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ సానా సతీష్, మహాసేన రాజేష్ తదితర టీడీపీ నాయకులు

మీరు చెప్పినట్టే అధిష్ఠానం నడుస్తుంది..

నాయకులు, కార్యకర్తలకు చంద్రబాబు దిశానిర్దేశం

ముమ్మిడివరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : పార్టీకి కార్యకర్తలే ముఖ్యం. మీ అభిప్రాయాల మేరకే పార్టీ అధిష్ఠానం నడుచుకుంటుంది. అనునిత్యం ప్రజలతో మమేకమై ఓటుబ్యాంకు పెంచే దిశగా పనిచేయాలని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ముమ్మిడివరం మండలం సీహెచ్.గున్నేపల్లి సత్తెమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో జరిగిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రోజు ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాలు పెట్టాం. రాబోయే ఎన్నికల్లో గతంలో ఓడిన 11 అసెంబ్లీ స్థానాలు మనమే గెలవాలి. టెక్నాలజీని పెంచుకుని సేవలు విసరిస్తున్నాం. ప్రజలతో కార్యకర్తలు మమేకమై మరింత పేరు తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. ముమ్మిడివరం నియోజకవర్గం టీడీపీ కంచుకోట. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో మహిళల ప్రాధాన్యత పెంచాల్సి ఉందన్నారు. 25 మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ల నియామకానికి సంబంధించి సర్వే నిర్వహించగా కొంతమందికి 90 శాతం, కొంతమందికి 50 శాతం రిపోర్టు వచ్చిందన్నారు. ఎస్సీ ఓటు బ్యాంకు పెంచేందుకు పీ4 అమలు చేస్తున్నాం అంటూ చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పనితీరుపై చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. సోషల్ మీడియా పోస్టింగుల్లో వెనుకబడి ఉన్నారంటూ చురక వేశారు. నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ముమ్మిడివరం నగర పంచాయతీ పార్టీ అధ్యక్షుల పనితీరు విశ్లేషించారు. బెస్ట్ అవార్డులు తీసుకున్న క్లస్టర్ ఇన్‌చార్జి గొలకోటి దొరబాబు, యూనిట్ ఇన్‌చార్జి దూలిపూడి వెంకటసుబ్బారావు, బూత్ ఇన్‌చార్జిల దంగేటి వీరప్రసాద్‌లను అభినందించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి, రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల చొప్పున పరిహారం

ఇటీవల గోదావరిలో గల్లంతై మృత్యువాత పడ్డ బాలుర కుటుంబాలకు సీఎం చంద్రబాబు ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించి వెంటనే అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అవగాహన లేకుండా సరదాల కోసం స్నానాలకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.


నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం

చెయ్యేరు.. జనం మురిసేరు!


ఏంటమ్మా.. సమస్య


చెరువు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

చంద్రబాబుకు నీరాజనం

- 2 గ్రామాల్లో 6 గంటల పర్యటన
- సమస్యలు విని.. పరిష్కారం
- జూన్ 12 తర్వాత గేర్ మారుస్తా
- ఆకట్టుకున్న చంద్రబాబు ప్రసంగం

అమలాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): సీఎంతో సమస్యలు చెప్పుకున్నారు..వెంటనే పరిష్కారం చూపారు.. హామీలు ఇచ్చారు..జనం మురిసేరు..మా బాబే అంటూ జేజేలు పలికారు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలోని కాట్రేనికోన, ముమ్మిడివరం మండలాల పరిధిలోని రెండు గ్రామాల్లో శనివారం ఆరు గంటలపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ప్రజావేదిక నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల్లో చైతన్యం పురికొల్పారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులతో మరో సమావేశం నిర్వహించి కేడర్‌కు నేనున్నాను అనే భరోసాను కల్పించారు. నేనున్నంత వరకు టీడీపీకి ఓటమి ఉండదంటూ కేడర్ హర్షధ్వానాల మధ్య చంద్రబాబు ప్రకటించారు. సీహెచ్ గున్నేపల్లిలోని హెలిప్యాడ్‌కు శనివారం 12 గంటలకు చేరుకున్న చంద్రబాబుకు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి కాట్రేనికోన మండలం చెయ్యేరులో చెరువు పూడికతీత పనుల్లో నిమగ్నమైన ఉపాధి శ్రామికులతో చెరువుగట్టున నడుస్తూ ముచ్చటించారు. ప్రజావేదిక సభలో చలోక్తులు, చురకలు, వార్నింగ్‌లు, హెచ్చరికలు చేస్తూ చేసిన ప్రసంగం అందరినీ ఉర్రూతలూగించింది.ఈ నెల 12వ తేదీ నాటికి ఏడాది పాలన పూర్తి కావడంతో పాలనా పరంగా గేర్ మారుస్తానంటూ సంకేతాలు పంపారు. చెయ్యేరులోని ప్రజావేదిక సభకు చేరుకుని రెండు బంగారు కుటుంబాలను దాతలకు దత్తత ఇచ్చారు. అదే వేదికపై సుమారు గంటా 45 నిమిషాల పాటు సుదీర్ఘ ప్రసంగం చేశారు. ప్రజావేదికలో నివేదికలను తప్పుడు తడకలుగా ఇవ్వడంతో అధికారులను మందలించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 10వేల ఇళ్లకు సోలార్ పవర్ కల్పించకపోతే 'ఎమ్మెల్యే పవర్ కట్' అవుతుందంటూ చంద్రబాబు వ్యాఖ్యానించడంతో సభలో నవ్వులు వెల్లివిరిశాయి. అవినీతి అధికారులకు ఘాటైన హెచ్చరికలు చేశారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తానన్నారు. ఇటీవల ఒక పాస్టర్ మరణాన్ని కొందరు స్వార్థపరులు హత్యగా విష ప్రచారం చేశారన్నారు. బంగారు కుటుంబాలకు భవిష్యత్తుకు భరోసా ఇస్తూ దాతలకు బాధ్యతలు అప్పగించారు. సాయంత్రం 5.45 గంటలకు సీహెచ్.గున్నేపల్లి నుంచి హెలికాప్టర్‌పై ఉండవల్లిలోని నివాస గృహానికి బయలుదేరి వెళ్లారు.



ఉపాధి శ్రామికులతో 15 నిమిషాలు..

నాయకుడంటే ఎలా ఉండాలి.. ప్రజలతో మమేకం కావాలి.. వారి సమస్యలు తెలుసుకోవాలి.. వాటి పరిష్కారానికి మార్గాలు వెతకాలి.. చెయ్యేరు గ్రామంలో ఇటువంటి ఆసక్తికరమైన సంఘటనే చోటుచేసుకుంది. ఆ గ్రామంలో రూ.9.86 లక్షలతో చేపట్టనున్న చెరువు పూడికతీత పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. నరేగా పథకం కింద అక్కడ పనిచేస్తున్న ఉపాధి హామీ మహిళా శ్రామికులతో ముచ్చటించారు. వారితో కలిసి చెరువు గట్టున తిరుగుతూ ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ల పథకంపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ పంపిణీలో లోటుపాట్లు ఏమైనా ఉన్నాయా అని అడిగారు. గ్రామంలో ఉన్న టీడీపీ నాయకుల పనితీరు.. ఉపాధి కార్మికుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ చెరువులో పూడికతీత పనులు ఎంతకాలం ఉంటాయని ఉపాధి కూలీలను అడగ్గా, రెండు నెలల పాటు ఉంటాయని సమాధానమిచ్చారు. సుమారు పదిహేను నిమిషాల పాటు వారితో గడిపి పథకాల అమలుపై సమాధానాలు రాబట్టి సంతృప్తిని వ్యక్తంచేశారు.


ప్రజా వేదికపై చంద్రబాబు పక్కన నిలబడి సమస్య విన్నవిస్తున్న మహిళ.. చిత్రంలో మంత్రులు సుభాష్, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బుచ్చిబాబు తదితరులు

అడిగింది లేదనకుండా.. అన్నీ ఓకే..!

చెయ్యేరు ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి హామీల వర్షం కురిపించారు. వృద్ధ గౌతమీ నదీపాయపై పల్లంకుర్రు- జి.మూలపాలెం మధ్య అసంపూర్తిగా ఉన్న వారధి నిర్మాణాన్ని రానున్న మూడేళ్లలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ముమ్మిడివరం- కాట్రేనికోన వంతెన, గోగులంక బ్రిడ్జి, కుండలేశ్వరం బ్లడ్‌బ్యాంక్ ఆధునీకరణ, చెయ్యేరులో చెరువును సీపీడబ్ల్యూ పథకంలో మంజూరు చేయాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు కోరారు. వీటికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను చంద్రబాబు వెంటనే ఆదేశించారు. చెయ్యేరు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని కోరారు.వీటికి యాక్షన్‌ప్లాన్ తయారుచేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో బీసీ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ కావాలని కోరడంతో మంజూరు చేస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆగస్టు నాటికి బంగారు కుటుంబాల సర్వే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.




మీ వెంటే ఉంటాం సార్ : ప్రజావేదిక సభలో ఒక మహిళ అభివాదం

సీఎంతో చిన్నారుల.. చిరు కోరిక!

అమలాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : నాడు సీఎం అంటే ప్రజలకు దూరం..దూరం.. నేడు సీఎం చిన్నారులకూ దగ్గరే.. చెయ్యేరు ప్రజావేదిక వద్ద అదే గ్రామానికి చెందిన కొందరు చిన్నారులు ముఖ్యమంత్రితో మాట్లాడడానికి ప్రయత్నించారు.. అది గమనించిన సీఎం దగ్గరకు పిలిచి ఏం కావాలమ్మా అని అడిగారు.. అంతే చిన్నారుల్లో పట్టలేని ఆనందం.. అడిగిందే తడవుగా క్రికెట్ ఆడుకోవడానికి క్రికెట్ కిట్ కావాలి సార్ అంటూ కోరారు. అడిగిందే తడవుగా వెంటనే కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌ను పిలిచి వెంటనే చిన్నారులకు క్రికెట్ కిట్ అందించాలని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ చెయ్యేరు గ్రామ సర్పంచ్ చెల్లి సురేష్ ద్వారా చిన్నారులకు క్రికెట్ కిట్ అందజేశారు. కిట్ అందుకున్న చిన్నారులు సంతోషం వ్యక్తం చేశారు.


ఏం కావాలో.. చెప్పండి : గ్రామంలోని పిల్లలతో ముచ్చటించి ఫొటో దిగిన దృశ్యం

క్రికెట్ కిట్ అందజేసిన దృశ్యం


నేనున్నా.. చెప్పండి : దివ్యాంగురాలి సమస్య విని అక్కడికక్కడే పెన్షన్ మంజూరు చేయించిన సీఎం

రేషన్ షాపులు సిద్ధం

- నేటినుంచి దుకాణాల్లో సరుకుల పంపిణీ
- పిఠాపురంలో ప్రారంభించనున్న మంత్రి నాదెండ్ల
- ఏర్పాట్లు చేస్తున్న పౌరసరఫరాల అధికారులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఇక ఎక్కడైనా రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు తీసుకునేలా కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తిచేసింది. పేదలకు రేషన్ సరుకులు అందించేందుకు రేషన్ దుకాణాలు సిద్ధమయ్యాయి. ఆదివారం ఉదయం 8గంటల నుంచే కార్డుదారులకు రేషన్ ఇవ్వనున్నారు. ప్రతినెలా ఒకటో తేదీనుంచి 15వరకు ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4గంటలనుంచి 8గంటల వరకు ఈ దుకాణాలు పనిచేస్తాయి. జిల్లాలోని చౌకధరల దుకాణాల ద్వారా నిత్యావసరాలు పంపిణీకి అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం చేపట్టింది. ఆదివారం పిఠాపురం గాంధీబొమ్మసెంటర్, నూకాలమ్మ టెంపుల్ స్ట్రీట్‌లో రేషన్ దుకాణంవద్ద సరకుల పంపిణీని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల ప్రారంభించనున్నారు.

పేదలకు నిత్యావసరాలు అందించే రేషన్ దుకాణాల్లో కొన్నింటిని గత వైసీపీ ప్రభుత్వం మూసేసింది. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ సరుకులు సరఫరా చేస్తామని చెప్పి వాటిని కొనుగోలు చేసింది. ఇంటింటికీ ఇవ్వడం మానేసి నెలలో ఒకట్రెండు రోజులు మాత్రమే జంక్షన్లలో వాహనం నిలిపి ఇవ్వడంతో ఎంతోమంది సరుకులు అందక ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను చక్కదిద్దేందుకు కూటమి సర్కారు పాత విధానంలోనే రేషన్ దుకాణాలవద్దే సరకులు అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆ సంస్థ ఉద్యోగులు రేషన్ దుకాణాలకు సరకుల తరలింపు, కచ్చితమైన తూకంతో అందించే చర్యలు చేపడుతున్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్లవద్ద వేబ్రిడ్జిలను పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు. శనివారం మండలాల్లోని రేషన్‌డీలర్లతో తహసీల్దార్లు సమావేశమయ్యారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే..

జిల్లాలో 1060 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా 6లక్షల43వేల874మంది కార్డుదారులు సరకులు తీసుకుంటున్నారు. ఏడు ఎంఎల్‌ఎస్ పాయింట్ల ద్వారా ఈ రేషన్ దుకాణాలకు సరకులు పంపిణీ చేస్తున్నారు. షాపు పనివేళలు, ధరలు, సరకు నిల్వను సూచించే బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని ఇప్పటికే డీలర్లకు అధికారులు ఆదేశాలిచ్చారు. 65 ఏళ్లపైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకు వెళ్లి సరకులు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 9300మెట్రిక్‌టన్నుల బియ్యం, 395 మెట్రిక్ టన్నుల పంచదారను జిల్లాలోని ఎంఎల్‌ఎస్ పాయింట్లలో సిద్ధం చేశారు.

ఇకపై లబ్ధిదారులు తమ నివాస ప్రాంతాలకు దగ్గరలో ఉన్న ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకోవచ్చు. రైస్ కార్డు నమోదైన డీలర్ దగ్గరే తీసుకోవాలన్న నిబంధన లేదు. దీనికి సంబంధించిన సాంకేతిక మార్పులు కూడా చేసినట్టు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు 91.62శాతం పంపిణీ

- ఒకరోజు ముందుగానే అందజేత

కలెక్టరేట్(కాకినాడ), మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ తొలిరోజు శనివారం 91.62శాతం నమోదైంది. మొత్తంగా 2,69,873మంది లబ్ధిదారులకుగాను 2,47,262మందికి పంపిణీ చేశారు. రూ.116కోట్ల 79లక్షలకుగాను రూ.106కోట్ల 21లక్షలు పంపిణీ చేశారు. గొల్లప్రోలు అర్బన్‌లో 94శాతం, తుని 93శాతం, కాకినాడ అర్బన్ 93శాతం, శంఖవరం 93శాతం, సామర్లకోట అర్బన్ 93శాతం పంపిణీ జరిగింది. పిఠాపురం అర్బన్ 92శాతం, యూ.కొత్తపల్లి 92శాతం, గండేపల్లి 92శాతం, పిఠాపురంరూరల్ 92శాతం, కాకినాడ రూరల్‌లో 92శాతం పంపిణీ నమోదైంది. ఏలేశ్వరం అర్బన్, పెద్దాపురం రూరల్, పెద్దాపురం అర్బన్, ఏలేశ్వరం రూరల్, రౌతులపూడి, సామర్లకోట రూరల్, తాళ్లరేవు, తుని అర్బన్, గొల్లప్రోలు రూరల్ ప్రాంతాల్లో 91శాతం నమోదైంది. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పంపిణీ జరిగింది. గ్రామవార్డు సచివాలయం ఉద్యోగులు పంపిణీలో పాల్గొన్నారు. ఒకరోజు ముందుగానే పింఛన్లు అందజేయడంతో పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు రూ.1.28కోట్ల రాయితీ: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మే 31(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహక రాయితీల కింద జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాల్లో 36 యూనిట్లకు రూ.కోటి28లక్షల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదించిందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడలో తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత త్రైమాసికాలంలో పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ 386 దరఖాస్తులు వచ్చాయన్నారు. సింగిల్ డెస్క్‌విధానంలో ఆయా శాఖల ద్వారా 333 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయగా 53 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ జీఎం గణపతి,ఏడీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ముందస్తు సాగుకు సమాయత్తం కావాలి: జేడీఏ

కరప, మే 31(ఆంధ్రజ్యోతి): జూన్ 1న కాలువలకు నీరు వదులుతున్న నేపథ్యంలో రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవ్వాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఎన్.విజయ్‌కుమార్ సూచించారు. కరపమండలం పెనుగుదురులో శనివారం ఆయన రైతు సేవాకేంద్రాన్ని సందర్శించి పలు అంశాలపై సిబ్బందితో చర్చించారు. సమీపంలోని అపరాల సాగును పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ముందస్తు సాగు చేపట్టాలని, వెదజల్లిక విధానం అవలంభించాలని సూచించారు. కరప ఏడీఏ బాబూరావు, ఏవో వెంకటరాజేష్, వీఏఏ శ్రీరాములు, పెనుగుదురు నీటి సంఘం అధ్యక్షుడు గోవిందరాజు పాల్గొన్నారు.

పొగాకు వినియోగంతో ప్రాణాంతక వ్యాధులు


పొగాకు ఉత్పత్తుల నష్టాలను వినూత్నంగా వివరిస్తున్న వైద్యాధికారులు

జీజీహెచ్(కాకినాడ), మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులతో క్యాన్సర్ తథ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. కమిషనర్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు వాడడంవల్ల ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్, క్షయ తదితర ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగాకు సేవించడం చట్టరీత్యా నేరమని, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు వంద మీటర్ల దూరంలో పొగాకు ఉత్పత్తులను విక్రయించరాదని, అమ్మితే సీవోటీ పీఏ యాక్ట్2003 ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. తొలుత పొగాకు వ్యతిరేక అవగాహన ర్యాలీని తెలుగుతల్లి విగ్రహం వరకు నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడి పొగాకు ఉత్పత్తుల నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ అరుణ, డీఎల్‌వో డాక్టర్ ఆర్.రమేష్, డీఐఓ డాక్టర్ సుబ్బరాజు, జిల్లా ఫైలేరియా అధికారి డాక్టర్ విల్సన్, డీఎంహెచ్‌ఓ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో.. బాలికల ప్రతిభ

- జిల్లాకు ఆరు పతకాలు
- ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు రెండో స్థానం


రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన కాకినాడ జిల్లా బాక్సర్లు, కోచ్ లక్ష్మణరావు

పిఠాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో కాకినాడ జిల్లా బాక్సర్లు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. విశాఖపట్టణంలోని స్పోర్ట్స్ స్టేడియంలో శనివారం జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల పోటీల్లో జె.ఐశ్వర్య సూర్యదీపిక, పి.మహాలక్ష్మి, ఎల్.లాస్య వెండి పతకాలు, కాకడ హర్షిణి, సీహెచ్ శ్వేత హస్సిక, ఎల్.రిషిక కాంస్య పతకాలు గెలుపొందారు. ఆంధ్రప్రదేశ్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో రెండోస్థానంలో నిలిచారు. పతకాలు సాధించిన బాక్సర్లను, కోచ్ పి.లక్ష్మణరావులను ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు, ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు పద్మనాభం అభినందించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం


ముఖ్యమంత్రి చంద్రబాబుకు నమస్కరించి స్వాగతం పలుకుతున్న మంత్రి సుభాష్



ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్యే చినరాజప్ప, రెడ్డి సుబ్రహ్మణ్యం

ఎమ్మెల్యే సుబ్బరాజును పలకరిస్తున్న సీఎం


చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కోనసీమ ఎస్పీ కృష్ణారావు, జేసీ నిశాంతి



ముమ్మిడివరం, మే 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి గ్రామంలో ఘనస్వాగతం లభించింది. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో శనివారం 12.21 గంటలకు సీహెచ్ గున్నేపల్లిలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. ఆయనకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సీఎం పర్యటన ప్రోగ్రాం కన్వీనర్ పెందుర్తి వెంకటేష్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చిల్లా జగదీశ్వరి, మాజీ ఎంపీ ఏజే వీవీ మహేశ్వరరావు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, రాజ్యసభ సాన సతీష్, మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ శాసనమండలి సభ్యుడు చిక్కాల రామచంద్రరావు, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, నాయకులు మోకా ఆనంద్‌సాగర్, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, చెల్లి అశోక్, టేకుమూడి లక్ష్మణరావు, తాడి నరసింహారావు, సాగి సూరిబాబురాజు, మోకా బాలప్రసాద్, కర్రా దుర్గాప్రసాద్, అత్తిలి బాబూరావు, దూడల స్వామినాయుడులతోపాటు పలువురు ఘనస్వాగతం పలికారు. తొలుత కార్యకర్తే అధినాయకుడు కార్యక్రమంలో భాగంగా కోనసీమ జిల్లా టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు (బాలు), స్థానిక సర్పంచ్ గొలకోటి దొరబాబులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అడబాల సతీష్‌కుమార్, అర్ధాని శ్రీనివాసరావు, చిక్కాల అంజిబాబు, దాట్ల బాబు, బోనం కృష్ణ, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, యాళ్ల ఉదయ్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు 12.35 గంటలకు హెలిప్యాడ్ నుంచి ప్రత్యేక వాహనంలో కాట్రేనికోన మండలం చెయ్యేరులో నిర్వహించే ప్రజాసేవ కార్యక్రమానికి హాజరయ్యారు.

చెయ్యేరు మంచినీటి ప్రాజెక్టుకు నిధులివ్వండి

ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే దాట్ల వినతి



సమీక్షలో మాట్లాడుతున్న దాట్ల

ఐ.పోలవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రజావేదికలో పాల్గొన్న సీఎం చంద్రబాబుకు ముమ్మిడివరం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు చేపట్టబోయే పథకాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సుమారు పది నిమిషాలసేపు చంద్రబాబు ముందు సమస్యలను ఏకరువు పెట్టారు. వాటికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. కాట్రేనికోన మండలం చెయ్యేరులో జరిగిన పేదల సేవలో పీ4 కార్యక్రమాన్ని ముమ్మిడివరం నియోజకవర్గంలో నిర్వహించినందుకు చంద్రబాబుకు ఆయన తొలుత కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో 42 వేలమందికి రూ.270 కోట్లు పింఛన్లు అందించడం జరుగుతోందన్నారు. పేదలకు అన్న క్యాంటీన్ల ద్వారా మంచిభోజనం అందిస్తున్నామన్నారు. రహదారులను అభి వృద్ధి చేయడంతోపాటు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. అయితే చెయ్యేరు గ్రామంలో తాగునీటిని బోరు ద్వారా అందించేవారమని, ఇటీవల చెరువుల వల్ల తాగునీటి కలుషితమైందన్నారు. ప్రస్తుతం చెరువును గత టీడీపీ హయాంలోనే రూ.18 కోట్లు మంజూరు చేసి తాగునీరు అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మంచినీటి పథకానికి నిధులు మంజూరుచేసి ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని కోరారు. గ్రామానికి సీసీ రోడ్లు, డ్రైనేజీలు పెండింగ్ పనుల జాబితా అందిస్తానని, వీటికి నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే కోరారు. ఎస్.మూలపాలెం వంతెనకు, ముమ్మిడివరం- కాట్రేనికోన వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామ కార్యదర్శి నివేదికను అందిస్తూ చెయ్యేరు గ్రామ జనాభా 7915 మంది, 2192 కుటుంబాలు ఉండగా, ఎన్టీఆర్ భరోసా కింద 1087 మందికి పింఛన్లు అందిస్తున్నామని, గ్రామంలో 141 బంగారు కుటుంబాలను గుర్తించగా, 9 మంది బంగారు కుటుంబాలను ఆదుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్టు తెలియజేశారు.

2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ : కోనసీమ కలెక్టర్


ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

అమలాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో శనివారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజావేదికను ఉద్దేశించి తొలుత జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ స్వాగత ఉపన్యాసం చేశారు. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు దార్శనికతతో రూపొందించిన 10 సూత్రాల విజన్ డాక్యుమెంట్లలో పేదరిక నిర్మూలనకు ప్రధాన స్థానం కల్పించారన్నారు. తొలుత సభాస్థలికి సుమారు 1.55 గంటలకు ప్రజావేదిక వద్దకు సీఎం చంద్రబాబు చేరుకున్నారు. ప్రజావేదిక వద్ద ఉన్న దివ్యాంగులతో చంద్రబాబు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను విన్న చంద్రబాబు పక్కనే ఉన్న జిల్లా కలెక్టర్‌ను వినతులను పరిష్కరించాలని ఆదేశించారు.

ఐపీఎల్ మ్యాచ్‌ల వీక్షణకు తొలిసారిగా

కాకినాడలో ప్రత్యేక స్క్రీన్లు

బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ గైక్వాడ్, ఎంపీ సతీష్ కార్యాలయ ఇన్‌చార్జ్ లక్ష్మణమూర్తి



మీడియా సమావేశంలో పాల్గొన్న గైక్వాడ్, లక్ష్మణమూర్తి

కాకినాడ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ మ్యాచ్‌ల వీక్షణకు క్రికెట్ ప్రేక్షకుల కోసం కాకినాడలో తొలిసారిగా ప్రత్యేక స్క్రీన్లతో ఏర్పాట్లు చేసినట్లు బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ అల్విన్ గైక్వాడ్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణమూర్తి వెల్లడించారు. జూన్ 1,3 తేదీల్లో సాయంత్రం 6 గంటల నుంచి జరిగే సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లకు సంబంధించి స్క్రీన్లపై వీక్షించే ప్రేక్షకుల నిమిత్తం కాకినాడ కాస్మో పాలిటిన్ క్లబ్‌లో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. గైక్వాడ్, లక్ష్మణమూర్తి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఐపీఎల్ క్వాలిఫై, ఫైనల్ మ్యాచ్‌ల వీక్షణ కోసం కాకినాడలోని స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో 10 వేలమంది వీక్షించేలా పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేశామన్నారు. 1న పంజాబ్, ముంబై జట్ల మధ్య జరిగే క్వాలిఫై మ్యాచ్‌తో పాటు 3న జరిగే ఫైనల్ మ్యాచ్ వీక్షించేలా ఏర్పాట్లు జరిగాయన్నారు. దేశవ్యాప్తంగా ఐపీఎల్ మ్యాచ్‌లు ఎంతో ప్రాచుర్యం పొందాయని, అందులో భాగంగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కృషితో క్రికెట్ ప్రేక్షకులకు కాకినాడలో పెద్ద స్క్రీన్లపై వీక్షించే అవకాశం కలిగిందన్నారు. క్రీడాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న ఆయన కాకినాడలో స్టేడియం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అలాగే ప్రతిభగల యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తు న్నారన్నారు. అనంతరం ఐపీఎల్ ఫాన్ పార్క్ టీ షర్ట్‌లను ఆవిష్కరించారు.

శుభ కార్యానికి వెళ్తుండగా...

భార్య కళ్లెదుటే భర్త మృతి

- భార్యకు గాయాలు
- మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ


ప్రమాదంలో మృతిచెందిన సత్యభాస్కరావు, గాయపడిన భార్యకు సాయం చేస్తున్న ప్రయాణికులు


సత్యభాస్కరావు (ఫైల్)

రాజానగరం, మే 31(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై లారీ ఢీకొని భర్త అక్కడికక్కడే మృతిచెందగా, భార్యకు గాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామానికి చెందిన బిక్కిన సత్యభాస్కరరావు (69), భార్య పాపాయమ్మ శనివారం మోటార్ సైకిల్‌పై పెద్దాపురం మండలం కట్టమూరులో జరిగే శుభ కార్యానికి బయలుదేరారు. మార్గమధ్యంలో రాజానగరం- కలవచర్ల జంక్షన్‌లోకి వచ్చేసరికి ఏడీబీ రోడ్డు వైపునకు మలుపు తిరుగుతుండగా విజయవాడ నుంచి ప్లాస్టిక్ పైపుల లోడుతో వైజాగ్ వెళ్తున్న లారీ ఢీకొనడంతో అదుపుతప్పి ఇద్దరూ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో భాస్కరరావు తలకు వెనుక వైపు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య పాపాయమ్మకు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులు మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. మృతుడి కుమారుడు విదేశాల్లో ఉంటున్నాడు. ఈ మేరకు రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ పర్యవేక్షణలో ఎస్.ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేశారు.

సీలేరు కాంప్లెక్స్ ఇన్‌చార్జ్

చీఫ్ ఇంజనీర్‌గా చిన్న కామేశ్వరరావు


బాధ్యతలు స్వీకరిస్తున్న కామేశ్వరరావు

మోతుగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి) మోతుగూడెం లోయర్ సీలేరు ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ స్వామి నాయుడు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తోన్న సీడీ చిన్న కామేశ్వరరావు ఇన్‌చార్జ్ చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టారు. కామేశ్వరరావుకు డీఈటీ వరప్రసాద్, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, సీనియర్ ఎకౌంటు ఇంజనీర్ వరప్రసాద్, సీనియర్ ఎకౌంటు ఆఫీసర్ వరప్రసాద్, పలువురు యూనియన్ నాయకులు అభినందనలు తెలిపారు.

ట్రాక్టర్ చక్రాల కింద పడి వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు


మృతిచెందిన పైడారావు

బిక్కవోలు, మే 31 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో శనివారం సాయంత్రం ట్రాక్టర్ కింద పడి రెడ్డి పైడారావు(57) మృతిచెందాడు. ఎస్ఐ వి.రవిచంద్ర కుమార్ వివరాల ప్రకారం.. పందలపాకకు చెందిన రెడ్డి పైడారావు కొమరిపాలెంలోని ఒక రైసుమిల్లులో పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం పని ముగించుకుని వస్తుండగా తొస్సిపూడి వంతెన అదే గ్రామానికి చెందిన గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి లిఫ్ట్ అడగగా అతడిని ఎక్కించుకుని వస్తూ పందలపాక కోదండరామా రైసు మిల్లు వద్ద ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేస్తుండగా డ్రైవర్ సిగ్నల్ ఇవ్వకుండా కుడి వైపుకు తిరగడంతో ఇద్దరు వెనుక చక్రం కింద పడిపోయారు. తీవ్రగాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పైడారావు మృతిచెందగా శ్రీనివాసరెడ్డి చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని రైతు మృతి


నారాయణమూర్తి (ఫైల్‌ఫొటో)

ఆలమూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు మృతిచెందాడు. మూలస్థాన అగ్రహారానికి చెందిన తోరాటి నారాయణమూర్తి (44) అనే రైతు ఉదయం తన పొలం పనులు ముగించుకుని తన గ్రామం పక్కనే ఉన్న జొన్నాడకు సైకిల్ వెళ్లి పశువుల దాణా తీసుకుని వస్తుండగా మూలస్థానం వచ్చేసరికి రావులపాలెం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రా వెల్స్ బస్సు వస్తువులు భద్రపరిచే డోర్ తెరచి ఉండటంతో సైకిల్‌పై వస్తున్న నారాయణమూర్తిని ఢీకొంది. దీంతో బలంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్టు ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు.

విద్యుత్ షాక్‌తో దింపు కార్మికుడి మృతి


కొబ్బరిచెట్టుకు రాజ్‌కుమార్ మృతదేహం

అంతర్వేది, మే 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం వీవీమెరక గ్రామం ప్రగతి నగర్‌లో దింపు కార్మికుడు బూసి రాజ్‌కుమార్ (నాని) (29) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్‌కుమార్ శనివారం ఉదయం 11 గంటలకు కొబ్బరిచెట్టు ఎక్కి దింపు తీస్తుండగా కొబ్బరి ఆకు 11కేవీ వైరుకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై కొబ్బరిచెట్టుకు వేలాడుతూ మృత్యువాత పడ్డాడు. స్థానికుల సమచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

డెల్టా కాలువలకు నేడు నీరు విడుదల

ధవళేశ్వరం, మే 31 (ఆంధ్రజ్యోతి): రబీ అనంతరం మూసివేసిన డెల్టా కాలువలకు ఆదివారం ఉదయం నీటిని విడుదల చేయనున్నారు. నిర్ణయించిన ముహూర్తం మేరకు గోదావరి మాతకు పూజలు చేసి ఆయా డెల్టా కాలువల పరిధిలో హెడ్ స్లూయిజ్ గేట్లను ఎత్తి అధికారులు నీటిని విడుదల చేయనున్నారు. కాల్వలకు నీటి విడుదల చేయనున్న నేపథ్యంలో సిబ్బంది హెడ్ స్లూయిజ్‌ల వద్ద మామిడి తోరణాలు కట్టి సిద్ధం చేస్తున్నారు.

అనుమానాస్పద మృతిపై కేసు

ద్రాక్షారామ, మే 31 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం అన్నాయిపేట గ్రామానికి చెందిన కొప్పిశెట్టి నారాయణ రావు(45) మృతిపై ద్రాక్షారామ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నారాయణరావు, పెంకె ప్రసాద్ స్నేహితులు. శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో నారాయణరావును ప్రసాద్ బయట నుంచి తీసుకొచ్చి ఇంటి వద్ద దింపి వెళ్లాడు. తిరిగి ప్రసాద్ మళ్లీ ఫోన్ చేయడంతో మళ్లీ బయటకు వెళ్లారు. అర్ధరాత్రి 12 దాటిన తన భర్త ఇంటికి రాకపోవడంతో నారాయణరావు భార్య సంధ్యారాణి ప్రసాద్‌కు ఫోన్ చేయగా నారాయణరావు కుప్పకూలిపోవడంతో ఆసుపత్రికి తరలించినట్టు ప్రసాద్ తెలిపాడు. దీంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చేరుకోగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో సంధ్యారాణి తన భర్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.లక్ష్మణ్ పేర్కొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా పల్లకీసేవ


ఆలయం లోపల పల్లకీసేవ నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి శనివారం పల్లకీసేవ వేడుకగా జరిగింది. ప్రతీ శనివారం ప్రాకార సేవ నిర్వహిస్తుండగా ఆ సమయంలో వాతావరణం సరిగా లేకపోవడంతో అర్చకులు పల్లకీసేవ నిర్వహించారు. ప్రధానాలయ గోపురాల నడుమ ముమ్మారు స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఉంచి భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్ఛరణతో వేడుకగా జరిగింది.

ఐఏఎస్ కృష్ణతేజ ప్రత్యేక పూజలు

సత్యదేవుడి సన్నిధిలో శనివారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యక్తిగత కార్యదర్శి, ఐఏఎస్ అధికారి కృష్ణతేజ కుటుంబసభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు

పాముకాటుకు వ్యక్తి మృతి


పాంగి రమేష్ (ఫైల్‌ఫొటో)

మోతుగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతరామరాజు జిల్లా వై.రామవరం మండలం డొంకరాయి గ్రామానికి పాంగి రమేష్ పాము కాటుకు మృతి చెందాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా రమేష్‌ను పాము కాటు వేసింది. డొంకరాయి జెన్కో ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శనివా రం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదుపై డొంకరాయి ఎస్ఐ శివకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిపోల ద్వారా

రేషన్ పంపిణీకి నేడు శ్రీకారం

పిఠాపురంలో ప్రారంభించనున్న మంత్రి నాదెండ్ల

పిఠాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాల ద్వారా కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీని కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో ఆదివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించనున్నారు. స్థానిక నూకాలమ్మ గుడి వద్దనున్న దుకాణంలో సరుకులను కార్డుదారులకు అందిస్తారు. అంతకు ముందు పాదగయ క్షేత్రంలో దివీస్ ల్యాబ్స్ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన ఆర్వో వాటర్ ప్లాంటు (కుక్కుటేశ్వర జలప్రసాదం)ను ప్రారంభించి, సకలేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని జనసేన వర్గాలు తెలిపాయి.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం సాయంత్రం జరగనున్నది. చైర్మన్‌గా వాకపల్లి దేవి సూర్యప్రకాష్, వైస్‌చైర్మన్‌గా గాది రాజబాబు, ఇతర డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేయనున్నారు. కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల పాల్గొంటారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతించం

5న ఏపీ ఎడ్‌సెట్-2025

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 12 పరీక్షా కేంద్రాలు

ప్రాంతీయ సమన్వయకర్త సుబ్బారావు


సుబ్బారావు

దివాన్‌చెరువు, మే31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 5న రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఏపీఎడ్‌సెట్-2025 పరీక్ష ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 12 కేంద్రాల్లో జరుగుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాల ప్రిన్సిపాల్, ఏపీఎడ్‌సెట్-2025 ప్రాంతీయ సమన్వయకర్త కొండ్రు సుబ్బారావు తెలిపారు. ఈ పరీక్షకు తనను ప్రాంతీయ సమన్వయకర్తగా ఎడ్‌సెట్ కన్వీనర్ నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారని శనివారం తెలిపారు. ఎడ్‌సెట్ పరీక్షకు దాదాపు 2500 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభం అవుతుందని, విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందుగానే పరీక్షా కేంద్రం లోపలికి అనుమతిస్తారని, ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించబోమని పేర్కొన్నారు. ఈ పరీక్షకు పరిశీలకులుగా ఉభయ గోదావరి జిల్లాల్లోని విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల నుంచి సీనియర్ ప్రొఫెసర్‌లను నియమించామన్నారు. కాగా ఏపీఎడ్‌సెట్‌కు ప్రాంతీయ కోఆర్డినేటర్‌గా నియమితులైన సుబ్బారావును వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ అభినందించి పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

స్త్రీ శక్తికి ప్రతిరూపం అహల్యాబాయి

చత్తీస్‌ఘడ్ డిప్యూటీ సీఎం అరుణ్ సావ్



అరుణ్ సావ్‌ను సత్కరిస్తున్న నాయకులు


మాట్లాడుతున్న అరుణ్ సావ్

రాజమహేంద్రవరం అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శక్తికి ప్రతిరూపం రాణి అహల్యాబాయి హోల్కర్ అని చత్తీస్‌ఘడ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం అరుణ్ సావ్ అన్నారు. తాను రాజమండ్రి రావడం ఎంతో ఆనందం కల్గించిందని, రాజమండ్రి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన సాంస్కృతిక రాజధాని అని పేర్కొన్నారు. శనివారం అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సూచన మేరకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అరుణ్ సావ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఆనాడు అహిల్యబాయి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలన్నీ నేడు ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందేలా అహల్యాబాయి ఆనాడే కృషి చేశారన్నారు. అందరి వికాసం, సంస్కృతి వికాసం జరగాలన్నది ప్రధాని మోదీ లక్ష్యమని, అందుకే బీజేపీ ఈ కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. పురందేశ్వరి విదేశాలకు వెళ్లి.. పాకిస్థాన్‌పై భారతదేశం ఆపరేషన్ సిందూర్ ఎందుకు చేపట్టిందనే విషయాన్ని, మన దేశ శక్తి సామర్థ్యాలను ప్రపంచదేశాలకు చాటిచెప్పే ప్రయత్నంలో ఉన్నారన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అహల్యాబాయి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ అహల్యాబాయి.. తన భర్త ఇచ్చిన అక్కౌంటు సరిగాలేదని తిరస్కరించిన దేశమాత, ధీరోత్తమురాలు అని అన్నారు. చరిత్ర, వారసత్వ సంపదను పరిరక్షించే పార్టీ బీజేపీ అని అన్నారు. రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ అహల్యాబాయి జీవిత విశేషాలను, సాహసోపేత కార్యక్రమాలను వివరించారు. ముందుగా వై.జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, లక్ష్మీ ప్రసన్న, హారిక, స్వర్ణ రజని, తపన చౌదరి, పరిమి రాధ, రొంగల గోపి, వీరా వీరాంజనేయులు, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

అమృత్ అంటూ స్వర్గం చూపిస్తున్నారు


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి

● పనులు మాత్రం జరగడం లేదు
● పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు

పిఠాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): అమృత్ అంటూ స్వర్గం చూపిస్తున్నారని, వాస్తవంలో ఒక్కపని కూడా జరగలేదని కౌన్సిలర్లు అన్నారు. పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన పురపాలక సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్ అమృత్-2 పథకం ద్వారా నిధులు మంజూరు అంశాన్ని అజెండాలో చేర్చడాన్ని ప్రస్తావించారు. గతం నుంచి ఈ పథకం ద్వారా కోట్లాది రూపాయలు నిధులు వస్తున్నాయని చెబుతున్నారని, ఎక్కడా పనులు మాత్రం ప్రారంభం కాలేదని తెలిపారు. మునిసిపల్ కమిషనర్ కనకారావు మాట్లాడుతూ గతంలో మంజూరైన నిధులు రద్దయి, మరలా రూ.57 కోట్లతో ప్రతిపాదనలు ఆమోదం పొందాయని, ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. మూడు నెలల్లో పనులు ప్రారంభించి 24నెలల వ్యవధిలో పనులు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. కౌన్సిలర్లు సూరవరపు సుజాత, రాయుడు శ్రీనుబాబులు మాట్లాడుతూ 29వ వార్డు, డ్రైవర్స్ కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటుచేయాలని కోరినా ఇప్పటివరకూ పనులు పెట్టలేదన్నారు. కుళాయిలు లేకుండానే పలువురికి కుళాయి పన్నులు వస్తున్నాయని, కుళాయిలు ఉన్నవారికి మాత్రం పన్నులు విధించడంలేదని రాయుడు శ్రీనుబాబు తెలిపారు.అధికారులు దృష్టిపెట్టాలనిసూచించారు.

37 ఏళ్ల తర్వాత

25వ వార్డులోని లేఅవుట్‌లో గిఫ్ట్ డీడ్ చేసిన ప్లాట్లు విడుదల అంశంపై కౌన్సిలర్ బొజ్జా జగదీశ్వరీ మాట్లాడుతూ 37 సంవత్సరాల తర్వాత ఈఅంశాన్ని అజెండాకు ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించారు. అందులో రోడ్లు అన్నీ పురపాలక సంఘమే వేసిందని తెలిపారు. తమ వార్డులో అంశాన్ని ఎందుకు ప్రస్తావిస్తున్నారని ముమ్మి డి రత్నసుజిత, ఇతర వార్డుల అంశాల్లో జోక్యం చేసుకోవడం తగదని బోను దేవలు సూచించారు. ఎక్కడ తప్పులు, అవినీతి జరిగినా తాను ప్రస్తావిస్తూనే ఉంటానని జగదీశ్వరీ స్పష్టం చేశారు. ఈ సమయంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. పట్టణంలో రూ.3కోట్లుతో పనులు చేపడుతున్నందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, జగ్గయ్యచెరువు కాలనీలో అభివృద్ధి పనులకు రూ. 50లక్షలు మంజూరు చేసినందుకు కాకినాడ ఎంపీ ఉదయశ్రీనివాస్‌లకు కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు. వేణుగోపాలస్వామి ఆలయం వద్ద కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.65లక్షలు మంజూరుచేసి అర్థాంతరంగా రద్దు చేశారని, ఇప్పటికే రూ.25లక్షల పని జరిగిందని చెప్పారు. తక్షణం నిధులు కేటాయించి పనులు పూర్తిచేయాలని కోరారు. ఈ పనిని దేవదాయశాఖ ద్వారా చేపట్టేందుకు పాడా పీడీ లేఖ రాశారని, త్వరలోనే పనులు చేపడతారని కమిషనర్ కనకారావు తెలిపారు. టిడ్కో గృహాలు ఎప్పుడు అప్పగిస్తారని అల్లవరపు నగేష్ ప్రశ్నించారు. బ్యాంకులు లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు.

చైర్మన్ సీటులో బొజ్జా రామయ్య

కౌన్సిల్‌హాలులోని చైర్మన్ సీటులో సీనియర్ కౌన్సిలర్ బొజ్జా రామయ్య ఆశీనులు అయ్యారు. సమావేశం నిర్వహిస్తూ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి బయటకు వెళ్లడంతో రామయ్యకు అవకాశం కల్పించాలని కౌన్సిలర్లంతా ముక్తకంఠంతో సూచించారు. దీంతో కౌన్సిల్‌లో అత్యంత సీనియర్‌గా ఉన్న రామయ్యను కౌన్సిలర్లంతా తోడ్కొని వెళ్లి చైర్మన్ సీటులో కూర్చొపెట్టారు. ఆయన కొంత సమయం సమావేశాన్ని నిర్వహించారు.

కమిషనర్ వైఖరిపై వైసీపీ కౌన్సిలర్ల నిరసన


నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

సామర్లకోట, మే 31 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ నెలవారీ సమావేశం నిర్వహించడంలో మున్సిపల్ కమిషనర్ వ్యవహరిస్తున్న వైఖరిని నిరసిస్తూ సామర్లకోట పట్టణంలోని 26మంది వైసీపీ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. ఈనెలలో మొత్తం రోజులు శనివారం తో ముగిసినా కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేయడంలో కమిషనర్ తీవ్ర నిర్లక్ష్యం చేశారని మున్సిపల్ వైస్‌చైర్మన్లు జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి, ఆవాల లక్ష్మీనారాయణలు ఆరోపించారు. ఈ కారణంగా పట్టణంలో అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుపడ్డాయని, కనీస సదుపాయాలు సైతం కల్పించకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇంకా పట్టణంలో తాగునీరు, వీధిలైట్లు, పారి శుధ్యం వంటి అంశాలపై కౌన్సిల్ అత్యవసరంగా చర్చించాల్సి ఉండగా అధికారులు పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే చైర్‌పర్సన్ అరుణపై మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించిన విషయం విదితమే. ఇటువంటి పరిస్థితుల్లో మున్సిపల్ ఉన్నతాధికారులు సత్వరం స్పందించి కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో 26 మంది వైసీపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యకు కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనలో నేతల హరిబాబు, యార్లగడ్డ జగదీష్, పిట్టా సత్యనారాయణ, స్వయంభారపు వీరభద్రరావు, సేపేని సురేష్, పాగా సురేష్‌కుమార్, కరణం కుమార్, రెడ్డి కుమారి, పాలిక కుసుమ పాల్గొన్నారు.

నేటి నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ

● కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర వెల్లడి

కాకినాడ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జూన్ 1 నుంచి డీలర్లు రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నారని కాకినాడ అర్బన్ తహసీల్దార్ వి.జితేంద్ర వెల్లడించారు. ఈమేరకు శనివారం తమ కార్యాలయంలో రేషన్ షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించి నియమ నిబంధనలు తెలియజేశారు. అనంతరం అర్బన్ తహసీల్దార్ మీడియాతో మాట్లాడుతూ ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు ఆదివారం సహా రేషన్‌షాపులు తెరిచి ఉంటాయన్నారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4నుంచి 8గంటల వరకు కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తారన్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు ఉదయం 12నుంచి సాయంత్రం 4గంటలలోపు ఇంటి వద్దే సరుకులు అందజేస్తారన్నారు. రైస్ కార్డు నమోదైన డీలర్ వద్దే సరుకులు తీసుకోవాలనే నిబంధన ఏమీ లేదన్నారు. కార్డుదారుల నుంచి అభిప్రాయాలు తెలుసుకోవడానికి ప్రతి రేషన్‌షాపు వద్ద క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ నగరంలోని 116 రేషన్‌షాపుల పరిధిలో 79,556 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు.

నేడు బ్యాంకుపేటలో ప్రారంభం

రేషన్ షాపులద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక బ్యాంకుపేటలోని రేషన్ షాపువద్ద కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ప్రారంభించనున్నారు. అర్బన్ తహసీల్దార్ వి.జితేంద్ర, ఎంఎస్‌వోలు, కూటమి నాయకులు, రేషన్‌డీలర్ల నాయకులు పాల్గొంటారు.

మడ అడవుల సందర్శన

తాళ్లరేవు, మే 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణా ఫారెస్ట్, ఏపీ ఫారెస్ట్ అకాడమీ ఫారెస్ట్ అధికారుల బృందాలు శనివారం కోరింగ అభయారణ్యంను సందర్శించారు. ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ బృందాలకు మడ అడవుల ప్రాధాన్యత, ఎకోడవలప్‌మెంట్ కమిటీల విధానాలు, వన్యప్రాణుల సంరక్షణ విషయాలను ఫారెస్ట్ బృందాలకు తెలియజేశారు.ఎఫ్ఎస్‌వో సిద్ధార్థకుమార్, వీరభద్రరావు, ఎఫ్‌బీవోలు మహేష్, సంధ్యారాణి, ధనలక్ష్మి, మదుబాబు పాల్గొన్నారు.

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 15వేల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. రూ.3,34,407 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

ఇన్‌చార్జి అకౌంటెంట్‌గా రామశాస్త్రి

కార్పొరేషన్(కాకినాడ), మే 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సూపరింటెండెంట్ ఎంవీ రామశాస్త్రిని ఇన్‌చార్జి అకౌంటెంట్‌గా నియమిస్తూ కమిషనర్ భావన ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు మేనేజర్‌గా, అకౌంటెంట్‌గా రెండు పోస్టుల్లో బాధ్యతలు నిర్వహించిన కర్రి సత్యనారాయణ జూన్ 30న పదవీ విరమణ చేయనుండడంతో అకౌంటెంట్ బాధ్యతలు రామశాస్త్రికి అప్పగించారు. సత్యనారాయణ మేనేజర్‌గా కొనసాగనున్నారు. టౌన్ ప్లానింగ్ సూపరింటెండెంట్‌గా మెప్మా సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కెసతీష్‌కి ఇన్ చార్జి బాధ్యతలు అప్పగించారు. ఉద్యోగుల సీనియార్టీని పట్టించుకోకుండా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నారని కార్పొరేషన్ ఉద్యోగుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

డీపీవోగా రమణ పదోన్నతిపై బదిలీ

కార్పొరేషన్(కాకినాడ), మే 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీఎస్‌గా పనిచేస్తున్న రమణ డీపీవోగా పదోన్నతిపై నరసాపురం మున్సిపాల్టీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకుసిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొత్తపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): కొండె వరం సచివాలయం సమీపంలో శనివారం అభయాంజనేయస్వా మి విగ్రహప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక రమణయ్యబీడు కాలనీ యూత్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణలతో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహో త్సవం చేపట్టారు. తొలుత విగ్రహాన్ని కొండె వరం గ్రామ పురవీదుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

విద్యుదాఘాతానికి తాటాకు ఇల్లు దగ్ధం

తాళ్లరేవు, మే 31 (ఆంధ్రజ్యోతి): గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామంలో మల్లాడి రాంబాబుకు చెందిన తాటాకు ఇల్లు విద్యుదాఘాతానికి దగ్ధమైంది. శుక్రవారం రాత్రి మల్లాడి రాంబాబు కుటుంబ సభ్యులతో చర్చికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్‌షర్ట్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించి తాటాకు ఇల్లు దగ్ధమైంది. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. స్థానిక వీఆర్వో శ్రీనివాసరావు, ఆర్ఐ రామకృష్ణలు సందర్శించి లక్ష రూపాయలు నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

దుర్గాడలో సినీనటుడు రాజీవ్ పూజలు

గొల్లప్రోలురూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఉన్న బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని ప్రముఖ నటుడు రాజీవ్ కనకాల శనివారం సందర్శించారు. ఆలయంలో స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యసిద్ధి హనుమాన్‌కు పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో కనకాలను సత్కరించి ప్రసాదాలు అందజేశారు.


పూజలు నిర్వహిస్తున్న సినీనటుడు రాజీవ్ కనకాల

నిండుగా ఉన్నావు!

● మీసాల రాజును చమత్కరించిన చంద్రబాబు

కాకినాడసిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): ఒంటి నిండా బంగారంతో ఎప్పుడూ నిండుగా కనిపించే ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణరాజు (మీసాలరాజు)ను ముఖ్యమంత్రి చంద్రబాబు నిండుగా ఉన్నావని చమ త్కరించారు. శనివారం మధ్యాహ్నం ముమ్మిడివరం హెలిప్యాడ్ దగ్గర ముఖ్యమంత్రి చంద్రబాబుకు మీసాల రాజు స్వాగతం పలికారు. ఒంటినిండా బంగారంతో కనిపించిన మీసాల రాజును చూసిన చంద్రబాబు నిండువా ఉన్నావని చమత్కరించారు. అక్కడే ఉన్న రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, పార్టీ నేతలు కాసేపు నవ్వుకున్నారు.


ముమ్మిడివరం హెలిప్యాడ్ దగ్గర చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మీసాల రాజు

ఆరోగ్యాభిషులంతా యోగాంధ్రలో భాగంకండి

● యోగాచార్య చిట్టిబాబు


కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో యోగా ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

కార్పొరేషన్(కాకినాడ), మే 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర ఉచిత యోగా క్యాంప్‌లో ఉద్యోగులు, నగరప్రజలు ముఖ్యంగా ఆరోగ్యాభిలాషులంతా ఉత్సాహంగా పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ యోగాగురువు చిట్టూరి చిట్టిబాబు పిలుపునిచ్చారు. శనివారం జరిగిన యోగాంధ్ర ఉచిత యోగా క్యాంప్‌లో యోగాచార్య చిట్టిబాబుతో యోగా గురువులు కె.రామచంద్రరాజు, డి.శివకుమారి, ఎం.మహిమ, మంజుశ్రీ బృందం యోగా ప్రోటోకాల్‌లో పేర్కొన్న సూక్ష్మ వ్యాయామాలు, ఆసనాలు, కపాలాభాతి క్రియ, ప్రాణాయామాలు, ధ్యానంపై శిక్షణ అందించారు. ఈ శిబిరంలో టీపీఆర్‌వో శైలజ, స్టాఫ్ సూపరింటెండెంట్ కె.సూర్యప్రకాశ్, యూపీఐ సెక్షన్ సూపరింటెండెంట్ సతీష్‌బాబు, మెప్మా సీఎంఎం వెంకట్రాజు, మున్సిపల్ కార్పొరేషన్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ బీచ్‌లో..

జేఎన్టీయూకే: కాకినాడఎన్టీఆర్ బీచ్‌లో జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ సెల్, క్రీడలు, వ్యాయామ విద్యా విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం యోగా ప్రదర్శన నిర్వహించారు. వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ సూచనల మేరకు మే 21నుంచి జూన్ 21 వరకూ విద్యార్థులకు, చిన్నారులకు, బోధన, బోధనేతర సిబ్బందికి, ప్రజలకు యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని విశ్వవిద్యాలయ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగా ప్రదర్శన నిర్వహించి సందర్శకులకు, ప్రజలకు యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగా శిక్షకురాలు డాక్టర్ సీహెచ్ సుధాదేవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, క్రీడాకారులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పిఠాపురం: పిఠాపురం పట్టణంలోని సినిమా సెంటర్‌లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రభుత్వ పోలీసు అధికారులు పాల్గొన్నారు. శనివారం యోగాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించి ఉప్పాడ సెంటర్‌లో మానవహారం నిర్మించారు. యోగా వలన కలిగే ప్రయోజనాలు గురించి యోగా గురువు వనం సత్యప్రియ వివరించారు. కార్యక్రమంలో పిఠాపురం మునిసిపల్ కమిషనరు నామ కనకారావు, సీఐ జి.శ్రీనివాస్, పట్టణ, రూరల్ ఎస్ఐలు మణికుమార్, జానీబాషా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాభ్యసనకు భవనం కేటాయింపు

సర్పవరంజంక్షన్: వాకలపూడిలో యోగాభ్యసన కోసం స్థలం భవనం కేటాయించాలన్న గ్రామస్థుల కోరికను మన్నించి పంచాయతీ నుంచి భవనం కేటాయించిన ఎమ్మెల్యే పంతం నానాజీకి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం గొడారిగుంటలో క్యాంపు కార్యాలయానికి వాకలపూడి జనసేనపార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు జీని శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, మహిళలు వచ్చి యోగాభ్యసన శిక్షణ కోసం భవనం కేటాయించాలని వినతిపత్రం అందించారు. వెంటనే గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాన్ని కేటాయించాలని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణమూర్తిని ఫోన్‌లో ఎమ్మెల్యే నానాజీ ఆదేశించారు.

'రక్తదానంతో ప్రాణదానం'


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ) మే31 (ఆంధ్రజ్యోతి): ఒకరు చేసే రక్తదానంతో నలుగురికి ప్రాణదానాన్ని అందించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. జిల్లాలో రక్తం యొక్క కొరతను నివారించేందుకు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వాలంటరీ బ్లడ్ డొనేషన్ క్యాంప్ ను కాకినాడ రామారావుపేటలోని యూపీహెచ్‌సీలో శనివారం నిర్వహించారు. డీఎం హెచ్‌వో మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరు రక్తదానం చేయాలని తద్వారా ఆపదలో ఉన్న వ్యక్తుల ప్రాణాలను కాపాడి వారికి పునర్జన్మను ప్రసాదించవచ్చన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, ఐసీటీసీ, ఏఆర్‌టీ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలు, స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌వో డాక్టర్ ఆర్.రమేష్, డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, డీపీఎంవో డాక్టర్ జి. లక్ష్మి, డాక్టర్ అరుణ, కేవీఆర్ శైలజా, ఏ. బుజ్జిబాబు, ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.


ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డితో గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్‌రికార్డ్ బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

గిన్నీస్ బుక్‌లో స్థానం పొందిన విద్యార్థులకు అభినందన

కాకినాడ రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ శ్రీవాగ్దేవి నృత్యనికేతన్ కూచిపూడి నాట్యాలయం నాట్యకళాకారులు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్‌రికార్డ్‌లో స్థానం పొందినట్లు సంస్థ కార్యదర్శి టి.తేజేశ్వరరావు తెలిపారు. 2023 డిసెంబర్లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ క్రీడామైదానంలో భారత ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్‌రికార్డ్ కార్యక్రమం నిర్వహించారన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 4218 మంది ఒకే వేదికపై కూచిపూడి నృత్యప్రదర్శన చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో శ్రీవాగ్దేవి నృత్యనికేతన్‌కు చెందిన బి.కావ్య, ఎస్.గంగాఉమామహేశ్వరి, సీహెచ్ బాలభవిష్య, పి.వీరలక్ష్మిప్రణతీలకు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌వారు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను పంపించారన్నారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి చేతులమీదుగా శనివారం ఆవిద్యార్థులకు పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాట్యగురువు కళ్యాణి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారామాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పిఠాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని చింతావారి వీధిలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి గణపతి సహిత సీతారామాంజనేయస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠా కార్యక్రమాలు శనివారం వైభవంగా జరిగాయి. శ్రీపీఠం స్వామీజీ పరిపూర్ణానంద సరస్వతి ప్రతిష్ఠా కార్యక్రమాన్ని జరిపించారు. అనంతరం భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. మునిసిపల్ వైస్‌చైర్మన్ కొత్తపల్లి పద్మ బుజ్జి దంపతులు, పి.సుధీర్ రాజు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సహా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం సీతారాముల కల్యాణం జరిగింది.

పిఠాపురంలో హోల్కర్ జయంతి

పిఠాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీ, పాదగయ క్షేత్రంవద్ద అహల్యాబాయి హోల్కర్ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఇండోర్ రాణిగా మహిళా సాధికారికత, వారి హక్కులు కోసం చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు, దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, పట్టణ అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు, బుర్రి మురళీధరారవు, పసుపులేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

పెద్దాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని ప్రకృతి వ్యవసాయం చేయాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వై.జ్యోతిర్మయి అన్నారు. శనివారం మండలంలోని కట్టమూరు రైతు సేవా కేంద్రంవద్ద పెద్దాపురం డీడీఏఎఫ్‌టీసీ హరి అధ్యక్షతన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీడీ జ్యోతిర్మయి హాజరై మాట్లాడారు. అలాగే కేవీకే కలువచర్ల వెటర్నరీ డాక్టర్ నాగేశ్వరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వెటర్నరీశాఖలో ఉన్న పథకాల గురించి వివరిస్తూ మినీ గోకులషెడ్లు 30 నుంచి 50శాతం వరకు సబ్సిడీ పైనా ఇస్తారన్నారు. పంటలు, పాడి పరిశ్రమపై అవగాహన కల్పించారు.

ప్రతీ పేదవారికి ప్రభుత్వ పింఛన్


పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప


కాకినాడలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

సామర్లకోట, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతీ పేదవాని జీవనం ఆర్థికభారం కాకూడదని భావించి కూటమి ప్రభుత్వం అర్హులైన అందరికీ పింఛన్లు పంపిణీ చేస్తుందని, సెలవు రోజులువస్తే ఒకరోజు ముందుగానే పింఛన్ సొమ్ములు పంపిణీ చేస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. జూన్‌నెల పింఛన్ సొమ్ములను ఒకరోజు ముందుగానే శనివారం ఇంటింటా పంపిణీ కార్యక్రమాన్ని సామర్లకోట మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గొంచాల గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే చినరాజప్ప ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ములు ఎమ్మెల్యే చినరాజప్ప అందజేశారు. ముమ్మిడి సూరిబాబు, ముసిరెడ్డి రాంబాబు, ముసిరెడ్డి శ్రీరాములు పాల్గొన్నారు.

కొండబాబుచే పింఛన్ల పంపిణీ

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన అందించే సామాజిక పెన్షన్లు పంపిణీలో భాగంగా శనివారం స్థానిక 15వ డివిజన్ ఏటిమొగలో లబ్ధిదారులకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అరదాడి శివ, వనమాడి ధర్మారావు, అంగాడి దుర్గారావు, పినపోతు జీవరత్నం, పట్టా ధనలక్ష్మి, ఓలేటి పాండురంగ, కామాడి సుబ్బారావు, కర్రి రాజారావు, సేరు శ్రీను, బలసాడి శ్రీను, పినపోతు దుర్గ పాల్గొన్నారు.

పెద్దకొడుకులా చంద్రబాబు భరోసా

సర్పవరంజంక్షన్: వృద్ధాప్యంలో ఏ ఒక్కరూ కుటుంబ సభ్యులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ఇంటికి పెద్ద కొడుకులా సీఎం చంద్రబాబు పింఛన్ సొమ్ము పెంచి ఆర్థిక భరోసా కల్పించారని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. శనివారం రమణయ్యపేట పంచాయతీ పరిధిలో గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో పసుపులేటి సతీష్ ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, గీత కార్మిక లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జొన్నాడ నరసింహరావు, కూటమినాయకులు తాటికాయల వీరబాబు, బాలాజీ, సంతోష్, శిరంగు శ్రీనివాసరావు, జీని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్ద పీట

పేదల సంక్షేమానికి సీఎం చంద్రబాబు పెద్ద పీట వేస్తున్నారని, ప్రతీ అవ్వా, తాత ఇంటికెళ్లి సామాజిక పింఛన్లు అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ నియోజకవర్గం కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తిలు తెలిపారు. శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను వలసపాకల, వాకలపూడి, గైగోలుపాడు, పి.వెంకటాపురం తదితర గ్రామాల్లో అధికారులతో కలసి లబ్ధిదారుల ఇళ్లకెళ్లి పింఛన్ సొమ్ము బట్వాడా చేశారు.


కాకినాడ రూరల్ రమణయ్యపేటలో దివ్యాంగుడికి పింఛన్ ఇస్తున్న ఎమ్మెల్యే నానాజీ

నేడు రేషన్‌షాపుల ద్వారా సరుకుల పంపిణీ

గండేపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపుల ద్వారా లబ్ధిదారులకు సరుకులు ఆదివారం నుంచి పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ముందుగా మండలంలో గండేపల్లి రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని లబ్ధిదారులందరికీ సక్రమంగా రేషన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



రంపచోడవరంలో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

అధికారుల అత్యుత్సాహంపై అసంతృప్తి

• అక్రమ కూల్చివేతలతో నీడను కోల్పోయిన ప్రజానీకం
• 3న జరిగే ఐటీడీఏ పాలకవర్గం వేదికగా ఆందోళనకు యత్నం

రంపచోడవరం, మే 31(ఆంధ్రజ్యోతి): అల్లూరి మన్యం రంపచోడవరం డివిజన్‌లో రహదారులపై ఆక్రమణల తొలగింపు పేరుతో ఐటీడీఏ, రెవెన్యూ, పోలీసుశాఖల అధికారుల అత్యుత్సాహం దినసరి వ్యాపారం చేసుకుని జీవించే ప్రజానీకాన్ని రోడ్డున పడేసింది. రెండు రోజులుగా ఆక్రమణల తొలగింపే లక్ష్యంగా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై అధికార పార్టీ నేతల్లోనే అసంతృప్తి వ్యక్తమవుతున్నట్టు తెలిసింది. వివరాల్లోకి వెళితే....

రంపచోడవరం డివిజన్‌లో ప్రధాన రహదారుల వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించే ప్రణాళికలను ఉన్నతాధికారులు సిద్ధం చేశారు. ఈ మేరకు అన్ని మండలాల తహశీల్దార్లు ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఆక్రమణల తొలగింపులో అనుసరించాల్సిన నిబంధనలను పాటించకుండా పేదల ఉసురు పోసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై ప్రజల నుంచి వత్తిడి వస్తుండటంతో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి, మాజీ ఎంపీ, బీజేపీ నేత కొత్తపల్లి గీత, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూ రమేష్, వంతల రాజేశ్వరి ఎవరికి వారు జిల్లా కలెక్టరు నుంచి రంపచోడవరం తహశీల్దారు వరకూ మాట్లాడి ప్రజలకు నీడ లేకుండా చేయవద్దని కోరినట్టు తెలిసింది. మరోపక్క అధికారులు తాము చట్ట ప్రకారమే వ్యవహరిస్తున్నామని, ఎక్కడా విధ్వంసానికి పాల్పడలేదని, ఆయా ఆక్రమణదారులే వాటిని తొలగించుకునే అవకాశాన్ని ఇచ్చామని అంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బలవంతపు ఆక్రమణల తొలగింపు, చట్ట ఉల్లంఘనలు కొనసాగుతుండటంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారపార్టీకి ఇది మచ్చగా మారుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



దేవీపట్నం పంచాయతీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, దేవీపట్నం సర్పంచ్

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

దేవీపట్నం, మే 31(ఆంధ్రజ్యోతి): జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో శనివారం మండల వ్యాప్తంగా పింఛన్లు పంపిణీ చేశారు. ఇందుకూరు వన్ ఏనుగులగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఎంపీడీవో డీఎస్ రత్నకుమారి, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, మంటూరు సర్పంచ్ నాగరత్నం శనివారం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రహదారుల నిర్మాణం ప్రారంభిస్తేనే దీక్ష విరమణ

ఎటపాక, మే 31(ఆంధ్రజ్యోతి): గుండాల పంచాయతీలో రహదారుల నిర్మాణం చేపడితే రిలే నిరాహార దీక్ష విరమిస్తామని సీపీఎం నాయకులు ఎంపీడీవో ఈ.ప్రేమ్ సాగర్‌కు తెలిపారు. రహదారులను అభివృద్ధి చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మూడో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ శనివారం దీక్షా శిబిరం వద్దకు వెళ్లి దీక్ష విరమించాలని కోరారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ రహదారుల నిర్మాణం ప్రారంభిస్తే దీక్షలు విరమిస్తామని తెలిపారు. అనంతరం ఎంపీడీవోకు పలువురు వినతి పత్రం అందజేశారు.



వార్డులు ప్రారంభించిన ఐటీడీఏ పీవో అపూర్వభరత్ తదితరులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల వార్డు ప్రారంభం

మోతుగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నిర్మించిన వార్డును శనివారం ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన క్యూబ్‌వైజ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ అధినేతలు సుకుమార్, రమా రూ.3లక్షలతో వార్డులో సదుపాయలు కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఉదయ్ కుమార్ రెడ్డి, నిఖిల్ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సత్కారం

దేవీపట్నం, మే 31(ఆంధ్రజ్యోతి): దేవీపట్నం ఎంపీడీవో ఆర్.రత్నకుమారి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఇందుకూరుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.మురళి, టీడీపీ మండల కన్వీనర్ ఎం.వెంకటేశ్వరరావు, దేవీపట్నం సర్పంచ్ కె.రాజామణి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధ్యాయుల బదిలీలు

రంపచోడవరం, మే 31(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలో పారదర్శకంగా బదిలీలు నిర్వహించినట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో ఆయన సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, డిప్యూటీ డైరెక్టర్ కె.రుక్మాండయ్యలతో కలిసి గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తోన్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ జరిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, ఏటీడబ్ల్యువోలు రామతులసి, కృష్ణమోహన్, సుజాత, జల్లి శంభుడు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పింఛన్‌దారులకు ఇబ్బందులు రానివ్వం : ఎమ్మెల్యే



ఇర్రిపాకలో పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులకు ఇబ్బందులు రానివ్వకుండా చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. శనివారం ఇర్రిపాకలో జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో పాల్గొని గ్రామంలోని రామిశెట్టి నూకరాజుకు హెల్త్ పెన్షన్ రూ.15 వేలును ఆయన ఇంటికి వెళ్లికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్‌దారులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి 1వ తేదీ సెలవు దినం వస్తే ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో పంతం సత్యనారాయణ, జ్యోతుల సత్యమూర్తి, పంచాయతీ సెక్రటరీ రాజన్‌రాజు, వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రంలో రైతులకు మేలు రకమైన పశువుల దాణాను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నాలుగు టన్నుల దాణాను మొత్తం 15 మంది పాడి రైతులకు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

7 వరకు ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

గండేపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 7వతేదీ వరకు ఎన్‌సీసీ సంయుక్త వార్షిక శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఈశిక్షణలో వివిధ సంస్థల నుంచి క్యాడెట్‌లు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ పి.ప్రవీణ్ బాబు మాట్లాడుతూ శిబిరం లక్ష్యాలను వివరించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని క్యాడెట్లను ప్రోత్సహించారు.

కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అచ్చంపేటలో కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

శంఖవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో అచ్చంపేట గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తిచేసిన కనకదుర్గమ్మ ఆయలంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠకు కొబ్బరికాయ కొట్టి నిర్మాణాన్ని ప్రారంభింపచేశారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నేత పర్వత సురేష్, బద్ది రామారావు, బద్ది రమణ, వెన్నా శివ, ఈగల దేవుళ్ళు, మహేష్, గాబు కృష్ణ, నక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు. ధ్వజస్తంభం ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అమ్మవారిని దర్శించుకుని ఆలయ నిర్వాహకులకు రూ.10 వేల నగదును బహుకరించారు. భారీ స్థాయిలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొట్టా చైతన్య, మొల్లి వీరబాబు, కోన బాబ్జీ, ఈగల గంగ, నక్కా బాబ్జీ, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో బీజేపీ శ్రేణుల పూజలు



సత్యదేవుడి సన్నిధిలో బీజేపీ నాయకులు

అన్నవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ధార్మిక పరిరక్షణ, ఆలయాల పునరుద్ధరణకు కృషిచేసిన రాణీ అహల్యాబాయి హోల్కర్ త్రిశత జయంతిని పురస్కరించుకుని శనివారం సత్యదేవుడి సన్నిధిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో బీజేపీ శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులతో బోధన

ఏలేశ్వరం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసుతుల సమకూర్చి నిపుణులైన ఉపాధ్యాయులతో బోధన సాగుతుందని ప్రధానోపాధ్యాయులు వాణి పద్మజ అన్నారు. శనివారం పట్టణంలో భవితాకేంద్రం ఉపాధ్యాయులు ఐదేళ్లు నిండిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీ కొన్న కారు : ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రత్తిపాడు జాతీయ రహదారిపై లారీని ఢీ కొన్న కారు

ప్రత్తిపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారి పాదాలమ్మ తల్లిగుడి సమీపంలోని పెట్రోల్ బంకు వద్దగల దాబా హోటల్ ఎదురుగా ఆగి ఉన్న లారీని శనివారం ఉదయం రాజమహేంద్రవరం నుంచి తుని వైపు వెళ్తున్న చిన్నకారు వేగంగా వచ్చి ఢీకొంది. కారు లో ప్రయాణిస్తున్న నలుగురులో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారికి స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించారు.

పింఛన్‌దారులు ఇబ్బందులు పడకుండా చర్యలు



ఉత్తరకంచిలో లబ్ధిదారుడుకు ఫించన్ అందజేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా

ప్రత్తిపాడు, మే31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పింఛన్‌దారులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. మండలంలోని ఉత్తర కంచి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం ఎమ్మెల్యే సందర్శించారు. ఎమ్మెల్యేకు ఆలయ ప్రధాన అర్చకులు, సర్పంచ్ మంతెన వెంకటరమణ (శ్రీను), సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ళ అప్పారావు ఆధ్వర్యంలో గ్రామస్థులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని 653 పింఛన్‌దారులకు రూ.29 లక్షలు పింఛన్ల సొమ్మును ఒకరోజు ముందుగానే పంపిణీ చేశారు. తర్వాత ఒమ్మంగిలో 1103 మందికి రూ.49 లక్షలు పింఛన్‌దారులకు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబుతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు అమరాది వెంకట్రావు, ఒప్పన రాజబాబు, ఉపసర్పంచ్ ఏటం చలమయ్య, పొనగంటి వీరాజు, అనపర్తి దుర్గారావు, వెన్నా దొర, గెడ్డా పండు, గంధం అప్పలరాజు, నెల్లిపూడి అంజి, రామశెట్టి దివానం, సుంకర సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో 90 శాతం పంపిణీ పూర్తి

ప్రత్తిపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం 90శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. మొత్తం 11513 మందికి గాను రూ.ఐదు కోట్లు విడుదలయ్యాయి. ఇంకా 1200 మందికి పంపిణీ చేయాల్సి ఉందని ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను నిర్ణీత గడువులోపు పూర్తిచేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న శ్రీధర్

తొండంగి, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన పథకాలను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని తుని నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.శ్రీధర్ ఆదేశించారు. శనివారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గృహనిర్మాణానికి సంబంధించి జూన్ 10 నాటికి 314 గృహాల నిర్మాణం పూర్తి కావాల్సి ఉండగా, 158 మాత్రమే పూర్తికావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పీఎం సూర్యఘర్ యోజన పథకంలో వెలుగు ద్వారా 836 దరఖాస్తులు స్వీకరించామని, వీటిలో 367 దరఖాస్తులను విద్యుత్ అధికారులకు అందించామని ఏపీఎం సత్తిబాబు వివరించారు. మండలస్థాయిలో జరిగే అన్ని అభివృద్ధి పథకాలను పూర్తిస్థాయిలో పూర్తయ్యేలా చూడాలని ఎంపీడీవో రాజేశ్వరరావుకు ఆయన సూచించారు. తహశీల్దార్ మురార్జీ, ఈవోఆర్డీ మార్కండేయులు పాల్గొన్నారు.

డి. పోలవరం పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం



కార్యదర్శిని సత్కరిస్తున్న దృశ్యం

తుని రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన డి.పోలవరం పంచాయతీ గ్రేడ్1 కార్యదర్శి అగ్రవరపు వెంకటరమణను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాయి నవీన్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిదులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చింతమనీడి అబ్బాయి, ఎంపీపీ బొప్పన రాము, చిటికెల వరహాల బాబు, అంకెంరెడ్డి నానబ్బాయి, చింతల వెంకటరమణ, పలకా సోమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడులో సూపర్‌స్టార్ కృష్ణ జన్మదిన వేడుకలు



జన్మదిన కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ప్రత్తిపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో శనివారం రాత్రి సూపర్‌స్టార్ కృష్ణ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనం గా నిర్వహించారు. అంబేడ్కర్ కళామందిర్ సెంటర్‌లో కృష్ణ అభిమాన సంఘ నాయకులు బత్తుల వెంకటేష్, అంజి, ఇరుకుల చక్రం, మేడపాటి కృష్ణల మధ్య వీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. సూపర్‌స్టార్ కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పెద్దఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

ప్రజలకు అన్ని వేళలా వైద్యం అందించడమే లక్ష్యం



జె.అన్నవరంలో పీహెచ్‌సీ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అన్ని వేళలా వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించడం జరిగిందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. జె.అన్నవరంలో శనివారం పను లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో మండల ప్రజా పరిషత్ నిధులతో ఆసుపత్రి నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. త్వరగా పనులు పూర్తిచేసి అద్దె భవనం నుంచి ఆసుత్రిని నూతన భవనంలోకి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. టీడీపీ నాయకులు మందపాటి అల్లర్కాజు, బజింకుల కన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీ

కిర్లంపూడి, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి రేషన్ డిపోల్లోనే సరుకులు పంపిణీకి పౌరసరఫరాల శాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కిర్లంపూడి మండలంలో 39 రేషన్ షాపుల్లో పంచదార, బియ్యం పంపిణీకి సిద్ధం చేశారు. దీంతో రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ డీలర్లు బాధ్యతగా పనిచేయాలి



ఏలేశర్వంలో రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్యవతి

ఏలేశ్వరం, మే 31 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులు అందించే విషయంలో డీలర్లు బాధ్యతగా పనిచేయాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి తెలిపారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిలర్ అలమండ చలమయ్య నేతృత్వంలో పట్టణానికి చెందిన 14 మంది రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని లబ్ధిదారులకు జూన్ 1 నుంచి సరుకులు అందించాలన్నారు. ప్రభుత్వం డీలర్లను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు రేషన్ అందించే అవకాశం కల్పించినందుకు డీలర్లు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శ



నాగేశ్వరరావు కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): పెదశంకర్లపూడికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు జువ్విన నాగేశ్వరరావు మృతి టీడీపీకి తీరని లోటని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఆయన ఇంటికి శనివారం వెళ్లిన ఆమె నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నాగేశ్వరరావు తనయుడు తిరుపతిరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ దోశే సూరిబాబు, వరుపుల రామకృష్ణ, మండలాధ్యక్షులు అమరాది వెంకట్రావు, సుంకర సోమరాజు, వరుపుల రూపులియ్య, చీకట్ల నాని, దోశే నవీన్, చెక్కపల్లి మందేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తతో దీక్ష విరమింపజేసిన పీడీ

శంఖవరం, మే31 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను తుచ తప్పకుండా పాటించాల్సిందే, ఇందులో మరోమాటకు తావులేదు.... కానీ నష్టపోయిన పద్మకు వేరే చోట ఉద్యోగం కల్పిస్తామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయకుమారి అన్నారు. అన్యాయంగా తనను ఉద్యోగం నుంచి తొలగించారని నిరాహార దీక్ష చేపడుతున్న ఎం.పద్మను కలిసిన ఆమె నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. అనంతరం మాట్లాడుతూ పద్మకు రౌతులపూడి మండలం సార్లంక మినీ అంగన్‌వాడీ కేంద్రంలో ఉద్యోగం కల్పిస్తున్నట్టు ప్రకటించారు. ఈనెల ఐదున దీనిపై అధికారికంగా ప్రభుత్వ ఆర్డర్ తీసుకొస్తామని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి చద్రావతి, శంఖవరం ప్రాజెక్టు అధ్యక్షురాలు రత్నకుమారి, గెడ్డం బుల్లెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికుల బకాయిలు చెల్లించాలి

తుని రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల బకాయి వేతనాలను చెల్లించాలని తుని ఎంపీడీవో సాయి నవీన్‌కు సీఐటీయూ నాయకుడు నెక్కళ్ళ శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. కూలీలకు ఎనిమిది వారాల బకాయిల డబ్బులు విడుదల చేయలేదని, అధికారులు చొరవ చూపి కూలి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మేధావులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయ వృత్తి : ఎమ్మెల్యే

జగ్గంపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): సమాజానికి అవసరమైన మేధావులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయ వృత్తిని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని మామిడాడలో ఉపాధ్యాయులు పసగొడుగుల బాబూరావు పదవీ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎంఈవోలు స్వామి అబ్బాయి, ఉపాధ్యాయులు పీవీ సత్యనారాయణ, తోలేటి సూర్యనారాయణ, కోన బాబూరావు, నాయకులు ఎస్‌వీ అప్పలరాజు, వేగి రామకృష్ణ, సూతిప్రసాద్, బోరయ్య సుమన్ , తదితరులు పాల్గొన్నారు.

అన్న నిధి కమిటీకి సౌండ్ సిస్టమ్ అందజేత

గండేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లూరు జియ్యన్న మఠంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జీయర్ శాశ్వత అన్నదాన నిధి కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. మల్లిశాలకి చెందిన ఇంజరపు దుర్గ, మేరి దంపతుల కుమారుడు రాజేష్ పుట్టినరోజు సందర్భంగా అన్ననిధి కమిటీకి రూ. 25 వేలు విలువ గల సౌండ్ సిస్టం అందజేశారు. దాత దుర్గ, మేరీ దంపతులను కమిటీ పెద్దలు సత్కరించారు.